నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 30 అక్టోబర్ 2024 | HYDERABAD

లైసెన్స్ పొందడం సులభం కాదు

ఇకపై 3 గంటల వీడియో వీక్షించాల్సిందే

ప్రమాదాల నివారణకు ఆర్టీఏ అధికారుల ప్రణాళికలు

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే 3 గంటల వీడియో వీక్షించాల్సిందే. అదేంటి అనుకుంటున్నారా? ఔను ప్రమాద రహిత ప్రయాణంపై రవాణా శాఖ అధికారులు 3 గంటల వీడియోను రూపొందించారు. ఈ వీడియోను లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ వీక్షించాలి. ప్రత్యేక రూంలో ఈ వీడియోను ప్రదర్శిస్తారు. ప్రమాదాలపై అవగాహన కల్పించే వీడియోను వీక్షించిన అనంతరం లైసెన్స్ ప్రక్రియ జరుగుతుంది. ఈ మేరకు ఆర్టీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయాల్లో వీడియో ప్రదర్శన అమలు చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన యాక్సిడెంట్‌లు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగిన ప్రమాదాలు, అతివేగంతో కూడిన ఘటనలు, బాధిత కుటుంబాల ఆవేదన తదితర హృదయవిదారక ఘటనలతో కూడిన వీడియోను ప్రదర్శిస్తారు. వాహనదారులకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఇన్‌చార్జి డైరెక్టర్, చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కె.రాములుకు వీడ్కోలు పలికి జ్ఞాపికను అందజేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్ శాఖ అధికారులు. - సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ)

ఓటీఎస్.. గందరగోళం!

మాఫీ కానీ నల్లా బిల్లు

ఆలస్యంగా అందుబాటులోకి తెచ్చిన జలమండలి

బకాయి చెల్లించి వారం రోజులైనా అప్రూవల్ చేయని అధికారులు

సాంకేతిక సమస్యలంటూ బుకాయింపు

అఫిడవిట్ ఇచ్చేందుకు అర్హులు ససేమిరా

దసరా ఆఫర్ అంటూ జలమండలి అందుబాటులోకి తీసుకొచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ గందరగోళంగా మారింది.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులు చెల్లిస్తే ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందాలని వినియోగదారులకు సూచిస్తూ ఈ నెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఆచరణలో మాత్రం జలమండలి మొద్దు నిద్ర వీడలేదు. అర్హుల ఎంపిక, యాప్ విధానం అమలులో జాప్యం చేసి.. చివరకు 17 రోజుల తర్వాత (ఈ నెల 22వ తేదీ)న జలమండలి అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకునేందుకు వినియోగదారులు రోజుకు 30 నుంచి 50 మంది వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఓటీఎస్ సద్వినియోగం చేసుకున్న వారికి 50 శాతం, తొలిసారిగా ఓటీఎస్ పొందుతున్న వారు 100 శాతం రాయితీ పొందుతున్నారు. ఈ క్రమంలోనే నిబంధనల మేరకు ప్రతి నెలా రెగ్యులర్‌గా నల్లా బిల్లు చెల్లిస్తానని అఫిడవిట్ రాసి ఇవ్వాలి. కానీ, చాలా మంది అఫిడవిట్ ఇవ్వడంలో భయాందోళనకు గురవుతున్నారు. అయితే తెరపైకి సెల్ఫ్ డిక్లరేషన్ అస్త్రాన్ని తీసుకొచ్చేందుకు జలమండలి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

-సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ)

ఓటీఎస్‌లో కట్టినా మాఫీ కానీ బిల్లు..

వినియోగదారులు నిబంధనల ప్రకారం యాప్ ద్వారా నల్లా బిల్లు (మాఫీ పోగా)ను చెల్లిస్తున్నారు. అయితే బిల్లు చెల్లించి వారం రోజులవుతున్నా.. మాఫీ అయినట్లు మాత్రం కనబడటం లేదంటూ జలమండలి డివిజన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నారని వినియోగదారులు మండిపడుతున్న పరిస్థితి. వాస్తవంగా ఓటీఎస్‌లో బిల్లు చెల్లించిన వెంటనే బిల్లును నాలుగు దశల్లో అధికారులు వారి వారి పరిధి మేరకు అప్రూవల్ చేయాల్సి ఉంటుంది. మేనేజర్ స్థాయిలో రూ. 2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10వేలు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ. లక్ష వరకు , చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ మాఫీ చేసే అధికారం ఉంది. కానీ సంబంధిత బిల్లును అప్రూవల్ చేసే ప్రక్రియలో సాంకేతిక సమస్య (యాప్) వచ్చిందని, మంగళవారం రాత్రి వరకు సమస్య కొలిక్కి వస్తుందని డివిజన్ అధికారులు చెబుతున్నారు. అధికారుల తప్పిదానికి బిల్లు చెల్లించిన వారంతా ఆందోళన చెందుతున్నారు.

మరో నెల పాటు అవకాశం ఇవ్వండి

ఓటీఎస్‌కు ఈ 4న ఉత్తర్వులు వెలువడగా..31వ తేదీ వరకు తుది గడువు ఇచ్చారు. అయితే అమలులో అధికారుల వైఖరి కారణంగా చివరి తొమ్మిది రోజులు మాత్రమే ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా వినియోగదారులకు అవకాశం దక్కింది. ఆలస్యంగా ఓటీఎస్ అందుబాటులోకి రావడం... అసలే దసరా, దీపావళి జంట పండుగలు ఈ నెలలోనే రావడం, పండుగ ఖర్చులు తడిసిమోపెడు కావడంతో ఓటీఎస్‌కు దూరంగా ఉన్నారు. దీంతో ఓటీఎస్‌కు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో మరో నెల పాటు ఓటీఎస్ గడువు పెంచాలంటూ జలమండలి అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. జలమండలికి వివిధ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి బకాయిలు పేరుకుపోయాయి.

ఖాకీలకు కాసులు కురిపిస్తున్న దీపావళి!

అక్రమ నిల్వలపై నిఘా లోపం II

ఎకరం వంద కోట్లకు విక్రయించిన స్థాయి నుంచి నెలకు 1500 యూనిట్లు కూడా అమ్ముకోలేని దుస్థితికి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దిగజారింది. ఇదేదో ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకులు చెబుతున్నవి కాదు. పలు రియల్ ఎస్టేట్ అధ్యయన సంస్థల నివేదికల్లో తేలింది. తాజాగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందంటూ సీఎం రేవంత్ రెడ్డి కూడా అంగీకరించారు. "ఈ పరిస్థితి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా ఇదే తీరుగా ఉంది" అంటూ నిజాన్ని ఒప్పుకున్నారు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ)

రియల్ ఢమాల్

అంగీకరించిన సీఎం రేవంత్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లు ఫోర్త్ సిటీ, మూసీ డెవలప్‌మెంట్ పేరిట మార్కెట్‌ను హైప్ చేసే ప్రయత్నం చేసినా... క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం ప్రకటనతో తేటతెల్లమైంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మార్కెట్ పడిపోయిందంటూ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న నిట్టూర్పు ప్రకటనలను హెచ్ఎండీఏ ముందుగానే గుర్తించినట్లు ఉంది. నగరంలో డెవలప్ చేసిన భూముల వేలం పై పునరాలోచన చేస్తున్నట్లు తెలిసింది. ప్రతిపాదిత లే అవుట్లలో భూములను విక్రయించాలని భావించినా... మార్కెట్ లేని కారణంగా అడుగులు వెనక్కి వేస్తున్నారు. దీంతోపాటు గతంలో హెచ్ఎండీఏ పరిధిలో ల్యాండ్ పూలింగ్ విధానంలో రైతుల నుంచి భూములు సేకరించి, వాటిని డెవలప్ చేసే ప్రణాళికలను కూడా పక్కనపెట్టినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ కేంద్రంగా మార్కెట్ మెరుగుపడే వరకు భూముల వేలంపై ఎలాంటి చర్యలు ఉండవని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి.

ముందుగానే గుర్తించిన హెచ్ఎండీఏ భూముల వేలానికి బ్రేక్ ఇవ్వాలని నిర్ణయం

గిరాకీ లేక రియల్ కార్యాలయాలు వెలవెల

రియాలిటీకి హాట్ కేక్ లాంటి మహానగరంలో క్రయవిక్రయాలు లేక బోసిపోతుంది. దసరా, దీపావళితో కళకళలాడే రియల్ ఎస్టేట్ కార్యాలయాలు గిరాకీ లేక వెలవెలబోతున్నాయి. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో భూములకు వేలం నిర్వహించడం తప్పుడు నిర్ణయమని హెచ్ఎండీఏ వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్ లేనప్పుడు మెరుగైన మౌలిక వసతులతో డెవలప్ చేసిన ప్లాట్లను విక్రయిస్తే అంచనాలకు మించిన ఆదాయాన్ని పొందలేమని ముందుగానే అంచనా వేశారు. దీంతో హైదరాబాద్ కేంద్రంగా భూముల వేలం పై హెచ్ఎండీఏ బ్యాక్ స్టెప్ వేస్తోంది.

ముందుకు కదలని ల్యాండ్ పూలింగ్..



నగరం నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్ తరహాలో నూతన నివాస ప్రాంతాలను డెవలప్ చేయాలని అప్పట్లో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని లేమూరు, ఇనుమల్ నర్వ, భోగారం, ప్రతాప సింగారం వంటి ప్రాంతాల్లో దాదాపు 1200 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించి డెవలప్ చేయాలని భావించారు. కానీ నిర్వహణ, నిధుల కొరత, రైతుల సమన్వయం లేకపోవడంతో పాటు, ప్రస్తుతం ఉన్న రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా ప్రతిపాదిత ప్రణాళికలను నిలిపివేసినట్లు తెలిసింది.

డిమాండ్ లేనప్పుడు ఎందుకనీ..

కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోనైనా కనిపించే ఓపెన్ లే అవుట్ల క్రయవిక్రయాలు కూడా ఆశించిన మేర జరగడం లేదు. కనీసం రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు అయినా డిమాండ్ ఉందంటే నెలలో 1500 నుంచి 1800 యూనిట్లు కూడా విక్రయించ లేకపోతున్నామని బిల్డర్లు, డెవలపర్లు వాపోతున్నారు. ఇలాంటి సమయంలో భారీ వ్యయంతో డెవలప్ చేసి తక్కువ ధరకు విక్రయించడం సరికాదని హెచ్ఎండీఏ భావిస్తోంది. గతంలో కోకాపేట్, బుద్వేల్ లాంటి ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలంతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు నేలచూపులతో నెట్టుకొస్తుంటే భూములను విక్రయించినా.. ఆశించిన ఆదాయం పొందలేమని లెక్కలు వేసుకుంటున్నారు. హెచ్ఎండీఏ ఇప్పటివరకు నిర్వహించిన లే అవుట్లలో మిగిలిపోయిన, తాజాగా బంజారాహిల్స్‌లోని 12 ఎకరాల భూమిని డెవలప్ చేసి విక్రయించాలనే ప్రతిపాదనల నేపథ్యంలో... వాటికి బ్రేకులు వేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. డిమాండ్ లేనప్పుడు మార్కెట్లోకి తీసుకొచ్చి, ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ఎందుకు కోల్పోవాలని అధికారులు అంచనా వేసుకుంటున్నారు. ఈ క్రమంలో దాదాపు వెయ్యికి పైగా మిగిలిన ప్లాట్లను ఇప్పుడు వేలం వేయడం కూడా సరైన నిర్ణయం కాదని భావిస్తున్నారు.

హైడ్రా, హెచ్ఎండీఏ దూకుడు

చెరువుల సుందరీకరణకు పోటాపోటీ

కోట్ల నిధులంటూ హడావిడి

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): లేక్‌సిటీగా పేరున్న హైదరాబాద్‌లో చెరువుల సుందరీకరణ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. గ్రేటర్ పరిధిలో చెరువుల సుందరీకరణలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో 3532 చెరువులు, జీహెచ్ఎంసీ పరిధిలో 185 చెరువులు ఉన్నాయి. వీటిలో చెరువుల సుందరీకరణకు సంబంధించి వేర్వేరుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సహజ వనరులైన చెరువులను పరిరక్షించడంతో పాటు భావితరాలకు భద్రంగా ఉంచడం, సుందరీకరణకు సంబంధించిన పనులు చేయడమే లక్ష్యంగా హెచ్ఎండీఏ పనిచేస్తోంది. అయితే చెరువుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రా.. చెరువుల్లో ఆక్రమణలంటూ కూల్చివేతలతో సామాన్యుడిని హడలెత్తించింది.ఇప్పుడేమో చెరువుల సుందరీకరణ పై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఫస్ట్‌ఫేజ్‌లో నాలుగు చెరువుల అభివృద్ధికి ప్లాన్ చేస్తుంది. దీపావళి తరువాత బెంగుళూరుకు వెళ్లి అక్కడి చెరువులను పర్యవేక్షించడానికి సిద్ధమైంది. కానీ, హైడ్రా పైలట్ ప్రాజెక్ట్‌గా నాలుగు చెరువులను సుందరీకరించడానికి నిర్ణయిస్తే.. మరోవైపు హెచ్ఎండీఏ 10 చెరువుల అభివృద్ధికి టెండర్లను పిలిచింది.

హైడ్రా పైలట్ ప్రాజెక్ట్..!

హైదరాబాద్ సిటీలో చెరువుల పూర్వ వైభవానికి హైడ్రా పైలట్ ప్రాజెక్ట్ చేపట్టబోతోంది. ఇందులో భాగంగా నగరం నలు వైపుల నుంచి ఒక్కో చెరువును ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వాటిలో బాచుపల్లి-ఎర్రగుంట చెరువు, మాదాపూర్-సున్నం చెరువు, కూకట్‌పల్లి-నల్ల చెరువు, రాజేంద్ర నగర్-అప్పా చెరువులను ఎంపిక చేసింది. ఈ చెరువుల సుందరీకరణను ఆరునెలల్లో పూర్తిచేసేలా ప్లాన్ చేసింది. ఈ చెరువులలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో మార్కింగ్ నెల రోజుల్లో పూర్తి చేయనుంది. తర్వాత చెరువుల చుట్టూ ఫెన్సింగ్, ఆ తర్వాత సుందరీకరణ ..దాదాపు 200 కోట్లతో బ్యూటిఫికేషన్‌కు సిద్ధమైన హైడ్రా దశల వారీగా పనులు చేయనున్నట్లు హైడ్రా అధికారి తెలిపారు. దీనికి సంబంధించి నాన్ రియల్‌ఎస్టేట్ సంస్థలకు అంటే ప్రభుత్వ , ప్రైవేటు బ్యాంకులు, ఇతర సంస్థలకు కాని సీఎస్ఆర్ పద్ధతిలో పనులు అప్పగించాలని నిర్ణయించింది. వచ్చే సంవత్సరానికల్లా మరికొన్ని చెరువుల సుందరీకరణ పూర్తిచేయాలని హైడ్రా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌లో ఎంపిక చేసిన చెరువులను పూర్తిచేసేందుకు ముందుకు రావాలని కొన్ని బ్యాంకులను హైడ్రా సంప్రదించినట్లు తెలుస్తోంది.

హెచ్ఎండీఏ పరిధిలో..

హెచ్ఎండీఏ పరిధిలో లేక్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా తొమ్మిది చెరువులను అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.30 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. నగరంలోని 5 చెరువుల సుందరీకరణకు పదికోట్లు కేటాయించారు. నిజాంపేట్‌లోని తుర్క చెరువుకు 3.52 కోట్లు, పటాన్‌చెరు గ్రామంలోని తిమ్మక్క చెరువు 1.85 కోట్లు , శంభీపూర్ గ్రామంలోని పోతిన్ చెరువు 1.19 కోట్లు, గాజుల రామారంలోని లింగం చెరువు 3.42 కోట్లు , ముత్తంగిలోని ఎన్నం చెరువుకు 5.02 కోట్లు, మూసాపేట్‌లోని కాముని చెరువుకు 5.15 కోట్లు , బోడుప్పల్‌లోని రా చెరువుకు 5 కోట్లు, సుద్దకుంట 3.07కోట్లు, ఆల్మాస్ కుంటకు 2.17 కోట్లతో సుందరీకరించనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్లను కూడా పిలిచారు. అయితే చెరువుల హద్దులు నిర్ణయించకుండా చెరువుల డెవలప్‌మెంట్ ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. చెరువుల హద్దులను హడావిడిగా సర్వే చేస్తున్నారని చెబుతున్నారు.

దీపావళి తర్వాత హైడ్రా బెంగళూరుకు వెళ్లి.. కొన్ని చెరువులను సందర్శిస్తారు. వరదల విషయంలో బెంగళూరులో సరైన నిర్వహణే లేనప్పుడు అక్కడికి వెళ్లి చెరువుల సుందరీకరణపై ఏం అధ్యయనం చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో చెరువుల పునరుజ్జీవం విషయంలో మిషన్‌కాకతీయ పథకం దేశవ్యాప్తంగా పేరుగాంచింది. చెరువులను ఎలా పునరుద్ధరిస్తారన్న విషయంలో పలు రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చి చెరువులను పర్యవేక్షించి వెళ్లారు. అటువంటిది బెంగళూరుకు వెళ్లాల్సిన అవసరమేంటి. అంతేకాకుండా హెచ్ఎండీఏ పరిధిలో ఇరవై చెరువులను గతంలోనే డెవలప్ చేశారు. వాటి తాజా స్థితి గతులను అధ్యయనం చేసి, పైలట్ ప్రాజెక్ట్‌లో చెరువులను గతంకంటే మరింత మెరుగ్గా అభివృద్ధి చేయవచ్చు కదా అని హైడ్రా అధికారి ఒకరు చెప్పారు.

చెరువుల సుందరీకరణ విషయంలో ఎవరిది బాధ్యత అన్నది స్పష్టత లేకుండా పోయింది. ఒకవైపు హెచ్ఎండీఏ చెరువుల సుందరీకరణ కొనసాగిస్తుంటే.. హైడ్రా పైలట్ ప్రాజెక్ట్ అంటూ ముందుకు పోతోంది. మరోవైపు నగరంలోని చెరువుల సుందరీకరణ జీహెచ్ఎంసీ చేపట్టాలి. కానీ ఈ మూడు సంస్థలు ఎవరికి వారే అన్నట్లుగా సమన్వయం లేకుండా వ్యవహరిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో జాప్యం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే క్రమబద్ధీకరణకు పునాది IV

ఎవరి హయాంలో కబ్జాలో తేల్చాలి

భట్టివి అసత్య ఆరోపణలు • ఆకాశంలో కాదు.. భూమిపై సర్వే చేయండి

చెరువులపై సిట్టింగ్ జడ్జితో నిజనిర్ధారణ జరగాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్

కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29 : ఆకాశంలో సర్వేలు.. అధికారులిచ్చిన తప్పుడు నివేదికలతో కూకట్‌పల్లిలోని చెరువుల ఆక్రమణలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖండించారు. నియోజకవర్గంలోని 9 చెరువుల ఆక్రమణలపై సిట్టింగ్ జడ్జి కమిటీతో సర్వే చేయించి నిజనిర్ధారణ చేయించాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి నిర్ణయించి.. ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి చెరువులలో కబ్జాలు జరిగాయని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా చెరువులపై తీసుకున్న సమాచారాన్ని పరిశీలిస్తే.. గత పదేండ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని 9 చెరువులలో ఎలాంటి కబ్జాలు జరగలేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. హైదరాబాద్‌పై అవగాహన లేని మంత్రి... తప్పుడు సమాచారంతో చెరువులు కబ్జా జరిగాయని మాట్లాడటం బాధాకరమన్నారు. ఆకాశం నుంచి సర్వేలు చేయడం కాదని, భూమిపై సర్వేలు చేసి నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. నల్ల చెరువు, సున్నం చెరువులలో బఫర్‌జోన్ పరిధిలో.. కోర్టులో కేసులు ఉన్న స్థలాల్లో నిర్మాణాలను హైడ్రా పేరుతో కూల్చివేశారన్నారు. హైడ్రా పేరుతో చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు నిద్ర లేకుండా చేశారన్నారు. చెరువు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని, వారికి అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. చెరువుల ఆక్రమణలపై ఎవరైనా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేస్తానని, చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

118 జీవో పరిధి కాలనీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- చేతకాని దద్దమ్మ మధు యాష్కీ
- చివరి కన్వీనియన్స్ డీడ్ వరకు నేనే ఇప్పిస్తా
- కాలనీ ప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

118 జీవో అమలులో కాంగ్రెస్ విఫలం

వనస్థలిపురం, అక్టోబర్ 29 : రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో తీసుకొచ్చిందని, దానిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్‌లో 118 జీవో పరిధిలోని కాలనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కేటీఆర్, కేసీఆర్ సహకారంతో ఎల్బీనగర్ నియోజకవర్గం కోసమే 118 జీవో తీసుకొచ్చామన్నారు. దానిని పూర్తి స్థాయిలో అమలు చేసి, అందరికీ కన్వీనియన్స్ డీడ్ ఇప్పించేందుకు కృషి చేస్తున్న సమయంలో ఎన్నికలు వచ్చాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా ఆపివేసిందన్నారు. కలెక్టర్, సీసీఎల్ఏతో దీనిపై మాట్లాడుతున్నానని, సీఎం ఆదేశాలుంటేనే తాము ఏదైనా చేయగలమని అధికారులు చెబుతున్నారన్నారు. విషయంపై అవగాహన లేని మధుయాష్కీ అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. నిజామాబాద్ ప్రజలు తరిమితే ఇక్కడికి వచ్చాడన్నారు. ప్రభుత్వంతో పని చేయించుకోలేని దద్దమ్మ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకుని పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నాడని, దాన్ని త్వరలోనే బయటపెడతామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలతో కలిసి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సమస్య పరిష్కరించే బాధ్యత తనదేనన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు, సతీశ్ గౌడ్, శివశంకర్, కాలనీల ప్రతినిధులు పుల్లారెడ్డి, రాంబాబు, పురుషోత్తం రెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆర్.ముత్యం రావు, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.